గ్యారెంటీల అమల్లో పూర్తిగా విఫలం

- రైతులు, ప్రజలను పట్టించుకోని ప్రభుత్వం
- స్థానిక సంస్థల ఎన్నిల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుంది
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్‌రెడ్డి

తాండూరు రూరల్, జనవరి 25 : గ్యారెంటీల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైనదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైల్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన తాండూరులోని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి నివాసంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశైల్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలోనే రాష్ట్రంలోని ప్రజలు సుభిక్షంగా ఉన్నారని.. రేవంత్ ప్రభుత్వ తీరుతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్ర భుత్వం రైతుభరోసాలో కోత విధించాలని చూస్తున్నదని మండిపడ్డారు. 14 నెలల పాలనలో హస్తం పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. లగచర్ల ఘటనలో మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి చాలా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. గ్రామాల్లో తిరుగుబాటు మొదలైందని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాం లో 24 గంటల కరెంట్ వచ్చేదని, ప్రస్తుతం ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడో పోతుందో తెలియని దుస్థితి నెలకొన్నదన్నారు. హైడ్రా పేరు తో హైదరాబాద్ ప్రజలను భయభాంత్రులకు గురిచేయడంతోపాటు సినిమా వారిని బెదిరించి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి వెళ్లడం ఖాయమన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ తాండూరు మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామసభల్లో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేక వచ్చిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అంటూ ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవడమే తప్పా మంజూరు ఎక్కడా కాలేదని విమర్శించారు. ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మాధవ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు రాజప్ప, మొగులప్ప, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, యాదప్ప, నరేందర్‌రెడ్డి, బీసీసెల్ అధ్యక్షులు ఆర్‌సీ గౌడ్, రాకేశ్, శంశోద్దీన్, హుసేన్‌పటేల్, ఉమాశంకర్, వసంత్‌కుమార్, హేమంత్‌కుమార్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేస్తున్న సర్కార్

- బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ కృషి మరువలేనిది
- కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్, జనవరి 25 : పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆరోపించారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన స్థానిక నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి మరువలేనిదన్నా రు. ఆరు గ్యారెంటీల అమల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. గ్రామసభల్లో అధికారులు ప్రకటించిన జాబితాల్లో అర్హులు కాకుండా అనర్హులే ఎక్కువగా ఉన్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజ లు తిరుగబడతారనే భయంతోనే పోలీస్ పహారాలో గ్రామసభలు నిర్వహించారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ప్రభుత్వం ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని ఆశ చూపుతున్నదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ కడ్తాల్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ లచ్చిరాం నాయక్, చంద్రమౌళి, మాజీ సర్పంచ్ కృష్ణయ్యయాదవ్, రాజేందర్‌యాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటయ్యయాదవ్, శ్రీను, లాయక్‌అలీ, రామచంద్రయ్య, పాండు, వీరయ్య, అంజి, వెంకటేశ్, శ్రీకాంత్, సుమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

ఏర్పాట్లు పక్కాగా చేయాలి

- నేడు నాలుగు పథకాల ప్రారంభోత్సవాలకు శ్రీకారం
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జనవరి 25 : రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఆదివారం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం సచివాలయం నుంచి సీఎస్ శాంతికుమారి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి మండలంలో ఓ గ్రామాన్ని ఎంపిక చేసి, సంక్షేమ పథకాల అమలు కార్యక్రమాన్ని అట్టహాసంగా చేపట్టాలని, వాటి అమలుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎస్ దిశానిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు పలు సూచనలు చేశారు. సంక్షేమ పథకాల అమలు కార్యక్రమానికి పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి.. మధ్యాహ్నం ఒంటి గంటకు పథకాల అమలుకు శ్రీకారం చుట్టాలన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లోనే నాలుగు పథకాల అమలును ప్రారంభించాలన్నారు. ముందుగా ముఖ్యమంత్రి సందేశంతో కూడిన వీడియోను ప్రదర్శించాలన్నారు. ఒక్కో పథకానికి ప్రత్యేకంగా ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆహార భద్రతా కార్డులకు తహసీల్దార్ నేతృత్వంలో, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపీడీవో ఆధ్వర్యంలో, రైతుభరోసాకు మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఏపీవో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు ఓవరాల్ ఇన్‌చార్జీలు వ్యవహరిస్తూ నాలుగు సంక్షేమ పథకాల అమలు ప్రారంభోత్సవ కార్యక్రమం సక్సెస్ అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లోని అర్హులకు తప్పనిసరిగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎలాంటి విమర్శలు, ఫిర్యాదులకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ , డీఆర్‌డీవో శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలం

మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్కు కోసం అసైన్డ్ భూములకు సంబంధించి దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామ రైతులతో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ ప్రతీక్ జైన్ చర్చించారు. భూసేకరణలో ఉన్న అభ్యంతరాలు తదితర అంశాలపై చర్చించారు. అంగీకరించిన రైతులకు ఎకరానికి రూ. 20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు, ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ చర్చల్లో 30 మంది రైతులు పాల్గొన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు ఎంతో విలువైనది

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేయించుకోవాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు, విద్యార్థులు ఓటర్లతో ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. 85 ఏండ్ల నుంచి ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్డీవో, జిల్లా స్వీప్ అధికారి సత్తార్ , అన్ని శాఖల అధికారులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

చౌడాపూర్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాలన చేతగాకే విమర్శలు..

- తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, ఉమ్మడి కులకచర్ల మండల మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్

కులకచర్ల, జనవరి 25 : పాలన చేతగాకే కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులను విమర్శిస్తున్నారని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్, ఉమ్మడి కులకచర్ల మండల మాజీ జడ్పీటీసీ రాందాస్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చౌడాపూర్ మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. పరిపాలన చేతకాక కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ నాయకులను విమర్శిస్తున్నారన్నారు. చౌడాపూర్ మండలం బీఆర్ఎస్ హయాంలోనే ఏర్పడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ హయాంలోనే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందాయని..ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతినెలా వచ్చే నిధులతో గ్రామాలు పరిశుభ్రంగా ఉండేవని అన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు విమర్శించడంపై మండిపడ్డారు. అలవి కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. వాటిని నెరవేర్చడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులను విమర్శిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజశేఖర్, పాల నర్సింహులు, శివకుమార్, జుబేర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండ్లి చేసుకోమని నిలదీస్తే.. చంపేశాడు

- హత్యకు దారితీసిన వివాహేతర సంబంధం
- కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ

షాద్‌నగర్ ఠాణాలో హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్, జనవరి 25 : వివాహేతర బంధం ఓ మహిళ ప్రాణం తీసింది. వివాహం చేసుకోవాలని తనతో వివాహేతర బంధాన్ని కొనసాగిస్తున్న వ్యక్తిని ఆమె నిలదీయడంతో అతడు ఆగ్రహానికి గురై దారుణంగా చంపిన ఘటన షాద్‌నగర్ పట్టణంలో వెలుగుచూసింది. శనివారం షాద్‌నగర్ ఠాణాలో జరిగిన విలేకరుల సమావేశంలో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ జిల్లా గొనేగండ్ల మండలంలోని బండమీది అగ్రహారానికి చెందిన అంద్రి దేవదాస్ అనే వ్యక్తి నందిగామ మండలం, కన్హాశాంతి వనంలోని కేసీసీ ఇంటర్ కళాశాలలో ప్రైవేట్ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదేవిధంగా నందిగామ మండలంలోని నర్సప్పగూడ గ్రామానికి చెందిన పిట్టల శివలీల(35)కు భర్త లేకపోవడంతో ఆమె కన్హాశాంతివనంలోనే కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నది. ఈ క్రమంలో ఇరువురి మధ్య పరిచయం ఏర్పడింది. అతడు పెండ్లి చేసుకుంటానని నమ్మించడంతో వారి మధ్య వివాహేతర బంధం ఏర్పడింది. తనను వివాహం చేసుకోవాలని శివలీల నిలదీస్తుండడంతో దేవదాస్ ఈ నెల 20న షాద్‌నగర్ పట్టణంలోని సంగమేశ్వర లాడ్జికి రామ్మని చెప్పగా.. ఆమె అక్కడికెళ్లింది. ఇరువురి మధ్య పెళ్లి ప్రస్తావన వచ్చింది. శివలీలను ఎలాగైన వదిలించుకోవాలని భావించిన దేవదాస్.. చీర కొంగును ఆమె గొంతును బిగించి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. లాడ్జి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడి నుంచి బంగారు, వెండి వస్తువులు, సెల్‌ఫోన్, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితుడిపై కర్నూల్ టౌన్ ఠాణాలో రౌడీషీట్ ఓపెన్ అయిందని, బైలుప్పల అనే గ్రామానికి చెందిన లక్ష్మిని హత్య చేశాడని వివరించారు.

ఖైదీల హక్కులపై అవగాహన

పరిగి, జనవరి 25 : సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఖైదీలకు ఉండే హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్లు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పరిగిలోని సబ్‌జైలులో ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జైలులో ఉండే ఖైదీలకు న్యాయ సాయం అందించేందుకు లీగల్ ఎయిడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్థోమత లేని వారికి ఉచిత న్యాయ సాయం అందిస్తామన్నారు. రాజ్యాంగం ఖైదీలకు కల్పించిన హక్కులపై అవగాహన కల్పించేందుకు దేశం లో ఉన్న అన్ని జైళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ శీతల్, పరిగి జూనియర్ సివిల్ జడ్జి నాగుల శిల్ప, పరిగి సబ్‌జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, డిఫెన్స్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, శ్రీనివాస్, పరిగి, తాండూరు, కొడంగల్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌లు గౌస్ పాషా, రవికుమార్, భాగ్యలత, ఎస్ఐ సంతోష్‌కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మీర్‌పేట కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి

స్థానిక సంస్థలను నిర్లక్ష్యం చేస్తున్నది..

- మీర్‌పేట కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 25: స్థానిక సంస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశం మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్ అధ్యక్షతన శనివారం జరిగింది. దీనికి సబితాఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. సర్పంచ్‌లు, ఎంపీటీసీల పదవీకాలం ముగిసినా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదని ఆరోపించారు. ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికలే నిర్వహించని వారు మున్సిపల్ ఎన్నికలను ఇప్పట్లో జరిపే పరిస్థితి కన్పించడం లేదన్నారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. స్థానిక సంస్థల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. మీర్‌పేట పాలకవర్గం, అధికారుల సహకారంతో అభివృద్ధి వేగవంతంగా జరిగిందన్నారు. అందరూ సహకరించడంతోనే మూడు చెరువులను అభివృద్ధి చేసుకున్నట్లు గుర్తు చేశారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. కాలనీల్లో ఉన్న పలు సమస్యలను కార్పొరేటర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా తప్పనిసరిగా వాటిని పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఎక్కడ సమస్యలున్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో చంద్రశేఖర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్, కార్పొరేటర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త చెరువును సందర్శించిన నీటి పారుదల శాఖ ఎస్ఈ

నీటిపారుదల శాఖ ఎస్ఈ రంగారెడ్డి శనివారం పరిగి పట్టణంలోని కొత్త చెరువును పరిశీలించారు. ఈఈ రేణుకాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ అరుణకుమారిలతో కలిసి ఎస్ఈ కొత్త చెరువును సందర్శించారు. చెరువు కట్టపై ఉన్న ముళ్ల పొదలను తొలగించి సర్వే చేయిస్తామని చెప్పారు. చెరువును పునర్నిర్మించి సుందరీకరించాలని స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు చెరువును పరిశీలించినట్లు సమాచారం. -పరిగి, జనవరి 25

బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతాం

గిరిజన భూబాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. శంకర్‌పల్లి మండలంలోని మోకిలా, వెలిమలతండాలో పలు రియల్ ఎస్టేట్ కంపెనీలు లంబాడా, గిరిజనులకు సంబంధించిన 80 ఎకరాల బిలాదాఖల భూములను ఆక్రమించుకోవడంతో గిరిజనులు చేపట్టిన రిలే దీక్షలు శనివారానికి 15వ రోజుకు చేరాయి. ఈ దీక్షకు ఆర్. కృష్ణయ్య మద్దతు తెలిపి మాట్లాడుతూ..గిరిజనులు తమ భూములకోసం పోరాటం చేస్తున్నా ప్రభుత్వ స్పందించకపోవడం తగదన్నారు. దీక్షలో రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, రవి, శంకర్, బాబు, బాలు, శంకరమ్మ, లక్ష్మణ్, గోపాల్, చందర్, మోహన్, లక్ష్మణ్, గోమా, బాల్‌రాజు, నహీం, సుధాకర్, నర్సింహా చారి, మల్లేశ్, రాజు తదితరులు కూర్చున్నారు. - చేవెళ్ల రూరల్, జనవరి 25

రాత్రి నోటీసు..

తెల్లారే మీటింగ్

- వారంలో రెండో సాధారణ సమావేశం
- ఒక్కో వార్డుకు రూ.2 కోట్ల చొప్పున కేటాయింపు

పెద్దఅంబర్‌పేట, జనవరి 25 : హడావుడి.. హడావుడి.. హడావుడి.. మున్సిపాలిటీ కౌన్సిల్ గడువు మరొక్క రోజులో ముగుస్తుండడంతో శనివారం హడావుడిగా జనరల్ బాడీ మీటింగ్ జరిగిపోయింది. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరైన సమావేశం గురించి కౌన్సిల్ సభ్యులకు ముందురోజు రాత్రి వరకు సమాచారం లేనట్టు తెలుస్తున్నది. రాత్రి సమావేశ నోటీసులు పంపిన మున్సిపల్ అధికారులు.. తెల్లారే మీటింగ్ నిర్వహించినట్టు సమాచారం. మున్సిపల్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలంటే కనీసం మూడ్రోజుల ముందుగానే కౌన్సిల్ సభ్యులకు సమాచారం ఇవ్వాలి. ఏదైనా అత్యవసరమైతే ముందురోజు సమావేశానికి సంబంధించిన నోటీసులు పంపించొచ్చు. అయితే రాత్రికి సమావేశ నోటీసులు పంపినట్టు తెలుస్తున్నది. జనవరి 17న మున్సిపల్ చైర్‌పర్సన్ పండుగల జయశ్రీ అధ్యక్షతన పెద్దఅంబర్‌పేటలో నిర్వహించిన కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఆ మీటింగ్‌లో వార్డుకు రూ.50 లక్షల చొప్పున అభివృద్ధి పనులకు కేటాయిస్తూ తీర్మానం చేశారు. మరికొన్ని అభివృద్ధి పనులకు సైతం ఆమోదం తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు.

అదేవిధంగా శనివారం తట్టిఅన్నారంలోని వార్డు కార్యాలయంలో మరోసారి చైర్‌పర్సన్ జయశ్రీ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికీ ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రంగారెడ్డి హాజరయ్యారు. అభివృద్ధి పనుల కోసం వార్డుకు రూ.2 కోట్ల చొప్పున, మున్సిపాలిటీలో ఇటీవల విలీనమైన 4గ్రామాలకు ఒక్కో దానికి రూ.50 లక్షల చొప్పున కేటాయించారు. ఇలా మొత్తం రూ.50 కోట్ల నిధులను అభివృద్ధి పనులకు కేటాయిస్తూ తీర్మానం చేశారు. అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలు లేకుండానే తీర్మానాలు చేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

రూ. కోటి విలువ చేసే

డ్రగ్స్, గంజాయి కాల్చివేత

నందిగామ, జనవరి 25 : షాద్‌నగర్ ఎక్సైజ్ ఠాణా పరిధిలో నమోదైన 17 కేసుల్లో సీజ్ చేసిన గంజాయి, డ్రగ్స్‌ను రంగారెడ్డి జిల్లా డిస్పోజల్, డిప్యూటీ కమిషనర్ దశరథ్ ఆదేశాల మేరకు శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కృష్ణప్రియ, ఏఈఎస్ శ్రీనివాస్‌రెడ్డి, షాద్‌నగర్ ఎస్‌హెచ్‌వో దేవేందర్ పర్యవేక్షణలో నందిగామ మండలంలోని మోత్కులగూడ శివారులోని కేజీ మల్టీకాన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో శనివారం కాల్చివేశారు. కాల్చివేసిన డ్రగ్స్, గంజాయి విలువ రూ. కోటి ఉంటుందని పోలీసులు తెలిపారు.

కాల్చివేసే ముందు గంజాయి, డ్రగ్స్‌ను చూపుతున్న పోలీసులు

పొగమంచు కమ్మేసింది


మొక్కజొన్న పంటను కప్పేసిన పొగ మంచు

ఉదయం 8దాటినా కనిపించని భానుడు..

పొగమంచు కేశంపేట మండలాన్ని కప్పేస్తున్నది. మంచు దుప్పటి కారణంగా ఎదురుగా పదిమీటర్ల దూరంలో ఉన్నా ఏ వస్తువు కూడా సరిగ్గా కనిపించక వాహనదారులు, రైతులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినా సూర్యుడు కనిపించకపోవడంతో వాహనదారులు హెడ్‌లైట్లను వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని లేమామిడి, బొదునంపల్లి, నిర్దవెల్లి, కాకునూరు, కొండారెడ్డిపల్లి, ఇప్పలపల్లి, పాపిరెడ్డిగూడ, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, కొత్తపేట, అల్వాల, తులవానిగడ్డ తదితర గ్రామాల్లోని ప్రజలు చలితో ఇబ్బంది పడుతున్నారు. పొగ మంచు కారణంగా గ్రామాల్లోని ప్రజలు, రైతులు చలిమంటలు వేసుకుంటున్నారు. -కేశంపేట, జనవరి 25

పొగమంచువల్ల కనిపించని రహదారి

చలిమంట వేసుకున్న స్థానికులు